వరదల నివారణకు సమగ్ర విధానం రూపొందించాలి

చిక్కడపల్లి, నవంబర్ 3: హైదరాబాద్ నగరంలో వరదల నివారణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(జేఎంఐ) ఆధ్వర్యంలో ఆదివారం సుందర్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పర్యావరణ నిపుణుడు బాబురావు, జేఎంఐ ఆర్గనైజర్లు సురేందర్ కుమ్ముల, సామాజిక కార్యకర్త మజార్ హుస్సేన్, డాక్టర్ పృథ్వీ హాజరై మాట్లాడారు. నగర ప్రజలు శ్రేయస్సు కోసం చెరువుల సంరక్షిణ, పునరుద్ధరణ ద్వారా వరదలను నివారించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, దీనిపై సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. పునరుద్ధరణకు అవసరమైన చర్యలు, భవిష్యత్తులో వచ్చే వరదల ప్రభావానికి తగ్గట్టు ప్రణాళికలు ఉండాలని చెప్పారు. వరదల వల్ల నష్టపోయిన వారికి, పునరావాసం, న్యాయమైన పరిహారం ఉండాలన్నారు. జేఎంఐ ప్రతినిధులు ఆకర్ష్ శ్రీరామోజు, నరేందర్ కలాల్, గౌతమ్ రాగి, శ్రీనివాస్ బొల్లాపల్లి, రేణుకా విధారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పాఠశాల సందర్శన

సికింద్రాబాద్, నవంబర్ 3: లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం సీతాఫల్‌మండి ప్రభుత్వ ప్రాథమికోన్నత, జూనియర్, డిగ్రీ కళాశాలలను సంర్శించనున్నారు. లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు, స్థానిక ప్రజలు, పాఠశాల, కళాశాల పేరెంట్స్ కమిటీ తో అక్కడ నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనాన్ని పరిశీలించనున్నారు. భవన నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని లష్కర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాధం బలరాజ్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

వాణిజ్య భవనాలకు నివాస పన్ను!

- జీహెచ్‌ఎంసీకి యేటా కోట్లలో నష్టం
- టీఐలు, బిల్ కలెక్టర్ల దోబూచులాట
- ఆజామాబాద్‌లోనూ అదే తీరు

ముషీరాబాద్, నవంబర్ 3: జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిలో వాణిజ్య భవనాలకు నివాస పన్ను చెల్లిస్తూ ఖజానాకు గండి కొడుతున్నారు. నివాస పన్నులతో పోలిస్తే వాణిజ్య భవన సముదాయానికి ఎక్కువ పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీంతో కొందరు యాజమానులు వాణిజ్య భవనాలకు కూడా నివాస పన్ను చెల్లిస్తూ జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో రాంనగర్, అడిక్‌మెట్, గాంధీనగర్, భోలక్‌పూర్, ముషీరాబాద్, కవాడిగూడ డివిజన్లలోని కాలనీ, బస్తీవాసుల నివాసాలకు నివాస పన్ను, వ్యాపార భవనాలకు వాణిజ్య పన్ను చెల్లింస్తుంటారు. ఇదిలా ఉండగా భారీ భవన సముదాయాల యాజమాన్యాలు కొంతమంది టాక్సీ ఇన్‌స్పెక్టర్లకు ఎంతో కొంత ముట్టచెప్పి వాణిజ్య పన్ను చెల్లింపు నుంచి తప్పించుకుటున్నారు. మరి కొంత మంది ఏండ్ల తరబడి నివాస భవనాల్లో వాణిజ్య, వ్యాపారాలు నిర్వహిస్తూ పన్ను ఎగ్గొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొందరు వాణిజ్య భవనాల్లో వ్యాపారులు, విద్యా సంస్థలు నిర్వహిస్తూ పన్ను మాత్రం సాధారణ, నామమాత్రంగా చెల్లిస్తూ గ్రేటర్ రాబడికి భారీగా గండి కొడుతున్నారు. సర్కిల్ పరిధిలో ఎక్కువగా స్టడీ సెంటర్లు, రీడింగ్ హౌస్‌లు, ప్రింటింగ్ ప్రెస్‌లు, ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటన్నిటికీ నివాస పన్ను రూపంలో మాత్రమే చెల్లింపులు చేసి చేతులు దులుపుకుంటున్నారని బాహాటంగానే చెబుతున్నారు. కొందరు టీఐలు, బిల్ కలెక్టర్లు అందిన కాడికి దండుకుంటూ అక్రమ వ్యాపాలను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు పేర్కొంటుండటం గమనార్హం. అంతే కాదు ఎప్పుడో ఇరవై ఏండ్ల క్రితం విధించిన పన్నులు ప్రస్తుతం విధిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. గాంధీనగర్‌లో కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్ల పేరుతో నిర్వహిస్తున్న వందలాది భవనాలకు వాణిజ్య పన్ను బదులు నివాస పన్ను విధిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

సర్కిల్-15 కార్యాలయం

ఆజామాబాద్ అదే పరిస్థితి..

ఆజామాబాద్ ఇండస్ట్రీస్ ఏరియాలో ఇటీవల కాలంలో పరిశ్రమలు పోయి ఇతర వాణిజ్య కార్యకాలాపాలు కొనసాగుతున్నాయి. స్టీలు సామాను, మిఠా బండార్‌లు, ప్లాస్టిక్, స్క్రాప్ గోదాం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో మెజారిటీ సంస్థలు వాణిజ్య, ట్రేడ్‌లైన్స్ పన్నులు చెల్లించడం లేదని సమాచారం. ఇంత జరిగినా.. పన్ను చెల్లించాలనే ఒత్తిడి వీరిపై ఉండకపోవడం గమనార్హం. ఈ విషయంపై డిప్యూటీ కమిషనర్ వివరణ కోరగా స్పందించలేదు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 3: భోలక్‌పూర్ డివిజన్ పీ అండ్ టీ కాలనీలో రూ.42లక్షల వ్యయంతో చేపట్టనున్న కమ్యూటీ హాల్ నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీల్లో మౌలిక సదుపాలు కల్పించడంతోపాటు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు చొరవ తీసుకొని హాల్ నిర్మాణానికి రూ.42 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. సాగర్‌లాల్ ఆసుపత్రి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డుకు త్వరలో మరమ్మతు పనులు చేయించనున్నట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో డ్రైనేజీ, రోడ్డు సమస్యను పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. గతంలో చేయని విధంగా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. ఇటీవల డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పనులు చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, బింగి నవీన్‌కుమార్, మహ్మద్ పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్, నవంబర్ 3: కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కంటే కూడా కేంద్ర నిధులతోనే ఎక్కువ పనులు జరుగుతాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ టీచర్స్ కోఆపరేటివ్‌కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. విద్యార్థి ఉద్యమం నుంచి తనను సమాజం గమనిస్తుందన్నారు. 35 ఏళ్లు హుజురాబాద్‌తో అనుబంధం ఉన్నప్పటికీ తాను 35 ఏళ్ల నుంచి అల్వాల్, శామీర్‌పేట్‌లోనే ఉంటున్నానని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతిరెడ్డి, వైవీ రావు శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్, పరుశురాం, వనజ, నగేశ్, ప్రశాంత్, సతీశ్, విశ్వనాథ్, పవన్‌కుమార్, మోహన్, ఉదయ్, మనోహర్, సబితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

పండుగలు సంస్కృతికి ప్రతీక

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కంటోన్మెంట్, నవంబర్ 3: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్‌లోని టివోలి గార్డెన్‌లో వివేకానంద బెంగాలీ స్వర్ణశిల్పి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళీమాత పూజల్లో పాల్గొన్నారు. పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భాష, ప్రాంతం వేరైనా వ్యాపార, ఉద్యోగ రీత్యా ఇక్కడకు వచ్చి స్థిరపడినప్పటికీ ఆచారాలు, సంప్రదాయాలను మరువకుండా ఎంతో ఘనంగా పండుగలను జరుపుకోవడం అభినందనీయమనని అన్నారు. ఎవరికి ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు బిశ్వనాథ్, సుజిత్ గోరాయి, తుషార్ సమంత, రాజు పండిత్, ఆనంద్ పాటిల్, బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్‌యాదవ్, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి ఉన్నారు.

కరాటేలో 'అంబేద్కర్' విద్యార్థుల సత్తా

విజేతలను సన్మానిస్తున్న ప్రతినిధులు

చిక్కడపల్లి, నవంబర్ 3 ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. ఎంబీఏ ప్రథమ సంవత్సరం ఎ.పురుషోత్తం బంగారు పతకాన్ని, బీస్సీ ప్రథమ సంవత్సరం కె.కౌశిక్‌ప్రణయ్ రజత పథకాన్ని, బీకాం ప్రథమ సంవత్సరం ఎం.పుష్కర్‌యాదవ్‌కు కాంస్య పథకాలను సాధించారు. ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ ఈ సందర్భంగా విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల కరస్పాడెంట్ డాక్టర్ సరోజవివేక్ విజేతలను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ టి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు తోడ్పాటు

న్యూబోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, నవంబర్ 3: సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగకరమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం న్యూబోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిల సహకారంతో సీఎంఆర్ఎఫ్ మంజూరు చేశారు. నేతాజీనగర్ రాజుయాదవ్‌కు రూ.60వేలు, పెద్దతోకట్ట సునీతకు రూ.12వేల 500, బాపూజీనగర్ నాగేశ్వర్‌రావుకు 15వేలు మంజూరు అయ్యాయి. చెక్కులను లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు.

కార్తీకమాసం ఎంతో పవిత్రమైంది

ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్, నవంబర్ 3: న్యూబోయిన్‌పల్లి చిన్నతోకట్ట సంజీవయ్యనగర్ వీకేర్‌సెక్షన్‌లోని పోచమ్మ ఆలయంలో శనివారం రాత్రి నుంచి కార్తీక మాస పూజలు ప్రారంభమైయ్యాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ భక్తులతో కలిసి ఆకాశ దీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, నగేశ్, యాదవరావు, వెంకటేశ్వర్, సిద్ధార్థ్, సువర్ణ, గౌరీ, లక్ష్మి, పుష్పలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

రామంతాపూర్, నవంబర్ 3 : ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం అడప భరణి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. వినాయక కౌతం, శివకౌతం, రామాయణం, రామదాసు కీర్తన, పుష్పాంజలి, నిమశ్శివాతేయ్, అందరికీ అభయమిచ్చు, జతిస్వరం, తదితర కీర్తనలకు కళాకారులు కూచిపూడి నృత్యం చేసి అలరించారు. ధృవిక, రచన, కీర్తన, నిహారిక, నందిని, శిరీష, అద్భుతి, వేదశ్రీ, లావణ్య, హాసని, మనోజ్ఞ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు స్కైఫౌండేషన్ చేయూత

అనాథలకు దుస్తులను అందజేస్తున్న ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు పావని

బన్సీలాల్‌పేట్, నవంబర్ 3: పద్మారావునగర్‌కు చెందిన స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫుట్‌పాత్‌లపై ఉంటున్న నిరాశ్రయులు, అనాథలకు దుస్తులను అందించామని అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బొల్లారం, నవంబర్ 3: గుర్తుతెలియని వ్యక్తి(65) మృతి చెందిన ఘటన ఆదివారం బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం సాధన మందిర్ చౌరస్తాలో ఓ షెడ్డు కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్: విద్యుత్ కేబుళ్ల మార్పిడి, చెట్లకొమ్మల కత్తిరింపు, మెయింటెనెన్స్ పనుల కారణంగా మంగళవారం బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ గోపి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కుమ్మరిబస్తీ, వినాయక్‌నగర్, విఠల్‌రావునగర్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల దాకా ఇమేజ్ గార్డెన్, సిలికాన్‌వ్యాలీ, సైబర్‌హిల్స్ కాలనీ, లూట్ మొబైల్ లేన్ ప్రాంతాల్లో, జూబ్లీహిల్స్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫిలింనగర్ ఫీడర్ పరిధి జూబ్లీహిల్స్ రోడ్ నం.45,52,53 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా జూబ్లీహిల్స్ రోడ్ నం.36లో సరఫరా ఉండదు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరించదగినవి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట నవంబర్ 3: మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు బోధనలు ఆచరించదగినవని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కృతజ్ఞతార్పణల పండుగను పురస్కరించుకొని ఎస్ఆర్‌నగర్‌లోని క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే తలసాని, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి హాజరయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా అశాంతి రేకెత్తుతున్న తరుణంలో మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచానికే ఆదర్శమన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా క్రైస్తవులైన ప్రతిఒకరు క్రమం తప్పకుండా ఆదివారాల్లో చర్చిల్లో ప్రార్థనలకు వెళుతూ ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళుతూ క్రమశిక్షణగా ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ ప్రతినిధులు జాయ్ మనోరమ, సైమన్ పీటర్, జాక్ రమణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్, అశోక్‌యాదవ్, దాడి ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, తదితరులు

హిమాయత్‌నగర్, నవంబర్ 3 : రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విభాగంలోని ఎన్‌హెచ్ఎం స్కీం కింద పనిచేసే రెండవ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

17న శంషాబాద్‌లో ప్రథమ మహాసభ

ఈ నెల 17న రంగారెడ్డి జిల్లా, శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో జరిగే సంఘం ప్రథమ మహాసభలకు రెండవ ఏఎన్ఎంలు అధిక సంఖ్యల్లో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో వారు ఆవిష్కరించారు. 17 ఏండ్లుగా పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కొత్త పథకాల రూపంలో వీరిపై ప్రభుత్వం పని ఒత్తిడి పెంచుతుందని ఆరోపించారు. మహాసభలో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి పర్వతాలు, రామస్వామి, శ్యామల శేఖర్‌రెడ్డి, బి.నరసింహ, ఎం.లక్ష్మీబాయి, హసీనాబేగం, పి.సురేశ్, జక్కుల పద్మ, అరుణ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులను పూర్తి చేయండి

ఘట్‌కేసర్,నవంబర్ 3 : ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తావద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణ పనులు గత 15 ఏండ్లుగా పూర్తికావడం లేదని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు హనుమాన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వీపర్ సాయిమల్లు కుటుంబానికి న్యాయం చేయండి

కాచిగూడ, నవంబర్ 3 : గత నెల 23వ తేదీ ఉదయం 5 గంటలకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హర్రాస్ పెంటకు చెందిన స్వీపర్ సాయిమల్లు(70) కుటుంబానికి న్యాయం జరిగేలా చేయాలని హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు కాచిగూడ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విధులు నిర్వహించడానికి ఇంటి నుంచి స్మశానవాటికకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో గుర్తుతెలియని ద్విచక్రవాహన దారుడు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని, ఘటన జరిగి 12 రోజులైనా కారుకుడైన ద్విచక్రవాహన దారున్ని పట్టుకొకపోవడం విడ్డూరమని అన్నారు. మృతి చెందిన సాయిమల్లుకు టుంబానికి త్వరితగతిన న్యాయం చేసి, ఆదుకోవాలని కాచిగూడ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

అజంతా రైల్లో దొంగతనం

కాచిగూడ, నవంబర్ 3: అజంతా రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఔరంగాబాద్ ప్రాంతానికి చెందిన రమేశ్‌నగరి భార్య నూతన్ రమేశ్‌నగరి(68) అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా నిజామాబాద్‌లో బ్యాగు చూసుకునేసరికి 15 గ్రాముల బంగారు ఆభరణాలు, ఖరీదైన ఫోన్‌ను దొంగిలించారు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

మహిళకు గాయాలు

కాచిగూడ, నవంబర్ 3: షాపునకు నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొట్టింది. కాచిగూడ ఎస్సై నరేశ్ తెలిపిన ప్రకారం.. గోల్నాకకు చెందిన బి.అరుణ గోల్నాకలో మిల్క్ పార్లర్ నడిపిస్తుంది. గత నెల 28వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి షాపునకు రావడానికి రోడ్డు దాటుతుండగా రామంతాపూర్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో అరుణ తల, చేతికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.